క్లుప్తంగా

కొరువాడలో జంగిల్ క్లియరెన్స్ పనులు



రోడ్లకిరువైపులా జంగిల్ క్లియరెన్స్ పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ నారాయణమూర్తి

కె.కోటపాడు : కొరువాడ గ్రామంలో **రోడ్లకిరువైపులా** పెరిగిపోయిన పిచ్చి మొక్కల**ను తొలగించే** పనులను పంచాయతీ అధికారులు చేపట్టారు. ఇటీవల వర్షాలకు రోడ్లపైకి విస్తరించిన మొక్కలను పొక్లెయిన్ సహాయంతో తొలగించే చర్యలు చేపట్టారు. జంగిల్ క్లియరెన్స్‌లో భాగంగా మొక్కలను తొలగిస్తుండడంతో రోడ్లపై ప్రయాణాలు చేసే వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులను సర్పంచ్ సింగంపల్లి నారాయణమూర్తి, పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్ పర్యవేక్షించారు.

ఘనంగా దేవి అంబలంపూజ



అంబలం పూజల్లో పాల్గొన్న భవానీ భక్తులు

చీడికాడ : మండలంలోని ఖండివరంలో శనివారం రాత్రి భవానీ పీఠం వద్ద జరిగిన భారీ అంబలం పూజల్లో భవానీ భక్తులు భారీగా పాల్గొన్నారు. అమ్మవారు ఆరో రోజైన శనివారం లలితా త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న భవానీ భక్తులు వివిధ ఉత్సవమూర్తిల వేషధారణలో అభినయిస్తూ ఆకట్టుకున్నారు. పరిసర గ్రామాల నుంచి భవానీ భక్తులు భారీగా పాల్గొన్నట్టు సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు తెలిపారు.

ఘనంగా భవానీభక్తుల ఘటాల పండగ



తలపై దీపపు ఘటాలను ధరించి ఊరేగింపుగా వెళ్తున్న మాలాధారులైన భక్తులు

కె.కోటపాడు : చౌడువాడ గ్రామంలో ఘటాల పండగను భవానీ మాలాధారులైన భక్తులు ఆదివారం రాత్రి ఘనంగా జరిపారు. గ్రామానికి చెందిన సుమారు 400 మంది మాలాధారులైన భక్తులు దీపపు ఘటాలను శిరస్సున ధరించి గ్రామంలో గల ప్రధాన వీధుల్లో ఊరేగింపు జరిపారు. ఘటాల పండగ నిర్వహణతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పండగలో భవానీ మాలాధారులతో పాటు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

షిర్డీసాయి మందిరానికి రూ.10 వేల విరాళం



విరాలం నగదును అందిస్తున్న ఉపేంద్ర

మాడుగుల రూరల్ : ఎం.కోడూరు గ్రామంలో నూతనంగా నిర్మాణం జరుపుకొంటున్న షిర్డీ సాయిబాబా మందిరం నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన మొండెపు ఉపేంద్ర రూ.10వేల నగదును విరాళంగా అందించారు. ఈ విరాళం ఆదివారం మందిరం నిర్వాహకుడు, మాజీ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ పడాల అప్పలనాయుడుకు అందించారు. మందిర నిర్మాణానికి భక్తులు ఆర్థిక సహాయం అందించాలని అప్పలనాయుడు కోరారు.

అధ్వానంగా కెనాల్ మట్టిరోడ్డు



కెనాల్ మట్టిరోడ్డు మార్గానికి పడిన గోతులు

కె.కోటపాడు : మండలంలో మెరక రామచంద్రపురం నుంచి పాతవలస వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డుకు వెళ్లే రైవాడ కెనాల్ మార్గం పెద్ద పెద్ద గోతులతో దర్శనమిస్తోంది. ఈ మట్టిరోడ్డు మార్గం గుండానే అధిక బరువులతో కూడిన వాహనాల రాకపోకలు జరగనుండడంతో రోడ్డు ఛిద్రంగా మారుతుంది. గోతుల్లో పడి అదుపుతప్పిన వాహనదారులు కెనాల్ మార్గం వైపు దూసుకెళ్తూ పెను ప్రమాదాలు బారిన పడుతున్నారు. ఇటీవల వర్షాలకు ఈ మట్టిరోడ్డులో గల గోతులు మరింత విస్తరించి ప్రయాణాలకు ఇబ్బందికరంగా మారింది. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు కెనాల్ మట్టిరోడ్డు మార్గానికి మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల వాహనదారులు కోరుతున్నారు.



కొనుగోలు చేసిన గొర్రెపోతుల తరలింపు



వడ్డాది సంతలో గొర్రెపోతుల అమ్మకాలు



వడ్డాది సంతకు తరలివచ్చిన ప్రజలు

వడ్డాది సంతకు దసరా కళ

- జోరుగా మేకపోతులు,
- నాటుకోళ్ల అమ్మకాలు

బుచ్చెయ్యపేట :మండలంలోని మేజర్ పంచాయతీ వడ్డాది సంతకు దసరా పండగ కళ వచ్చింది. నాటుకోళ్లు, గొర్రెపోతుల కొనుగోళ్లకు వడ్డాది సంత ప్రసిద్ధి. జిల్లాలోనే పెద్ద సంత కావడంతో పాటు దసరా పండగ రావడంతో ఆదివారం సంత పండగ శోభ సంతరించుకుంది. గురువారం దసరా పండగ అవడం పండగ నాడు అమ్మవారికి మొక్కులు తీర్చడం ఆనవాయితీగా వస్తోంది. దసరా నాడు అమ్మవారికి మొక్కులు తీర్చేందుకు నాటుకోళ్లు, గొర్రె, మేక పోతులు కొనుగోళ్లు జోరుగా సాగాయి. ఉదయం 8 గంటల నుంచి విశాఖ, పాడేరు, పెందుర్తి, నర్సీపట్నం, గాజువాక, అనకాపల్లి, సబ్బవరం, మాడుగుల, చోడవరం తదితర ప్రాంతాలకు చెందిన కొనుగోలుదారులు వడ్డాది సంతకు భారీగా తరలివచ్చారు. రైతులు తీసుకొచ్చిన పొట్టేళ్లు, నాటుకోళ్లతో సంత నిండిపోయింది.

భలే గిరాకీ...

ఒక్కో మేక, గొర్రె పోతులు రూ. 12 వేల నుంచి రూ.25 వేల వరకు ధర పలికాయి. నాటుకోళ్ల



వడ్డాదిలో నాటుకోళ్ల అమ్మకాలు

రూ.800 నుంచి రూ.4 వేలు వరకు ధర పలికాయి. వడ్డాది సంతలో నాటుకోళ్లు, పొట్టేళ్లతో పాటు పండగకు అవసరమైన ఇతర వస్తువులు కూడా కొనుగోళ్లు, అమ్మకాలు భారీగా జరిగాయి. పొట్టేళ్లు, నాటుకోళ్లు భారీగా కొనుగోళ్లు చేసిన వారు వ్యాన్‌లు, ఇతర వాహనాల ద్వారా వాటిని తరలించారు. సంతకు వచ్చిన జనంతో వడ్డాది రోడ్లు రద్దీగా మారాయి.

బొడ్డేడ ప్రసాద్‌కు మాజీ ఎమ్మెల్యే గణేష్ అభినందనలు

నర్సీపట్నం : వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్‌ను మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సత్కరించారు. ప్రసాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో పర్యటనలో భాగంగా ఆదివారం నర్సీపట్నంలో మాజీ ఎమ్మెల్యే గణేష్ నివాసానికి విచ్చేసారు.ఈ సందర్భంగా ప్రసాద్‌కు సాలువ కప్పి గణేష్ సత్కరించారు. సత్కరించిన వారులో లీగల్‌సెల్ విభాగం నాయకులు మాకిరెడ్డి బుల్లిదొర, మాకవరపాలెం, గొలుగొండ మండల పార్టీ అధ్యక్షులు చిటికెల వెంకటరమణ, ఫాణిశాంతరావు, పార్టీ నాయకులు పెట్ల అప్పలనాయుడు, విద్యార్థి విభాగం నియోజకవర్గం అధ్యక్షులు కిల్లాడ శ్రీనివాసరావు, పెట్ల భద్రాచలం, బేతిరెడ్డి విజయ్‌కుమార్, పైడిరాజు పాల్గొన్నారు.



బొడ్డేడ ప్రసాద్‌ను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్, పార్టీ నాయకులు

నిరుద్యోగులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

నాతవరం : ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు కష్టపడి చదువుతున్న నిరుద్యోగ యువతకు స్టడీ మెటీరియల్‌తో పాటు అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తానని నాతవరం ఎస్‌ఐ వై.తారకేశ్వరరావు అన్నారు. పి.జగ్గంపేట గ్రామంలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు సర్పంచ్ జివిరెడ్డి సోమన్నదొర ఆధ్వర్యంలో ఆదివారం ఫ్రెండ్లీ పోలీసింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ ప్రత్యేక శ్రద్ధతో మండలంలో పోటీ పరీక్షలకు సిద్ధపడుతున్న నిరుద్యోగులకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను దాతల సాయంతో ఏర్పాటు చేశారు. వాటిని మండల వ్యాప్తంగా పోటీ పరీక్షలకు సిద్ధపడుతున్న వారికి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో అనేక ఉద్యోగాల కోసం నోటిఫికేషన్లు విడుదల అయ్యాయన్నారు. ఉద్యోగం సాధించేందుకు పట్టుదలతో చదివితే ఆశయం నెరవేరుతుందన్నారు. స్టడీ మెటీరియల్ అందించేందుకు పోలీసుస్టేషన్‌లో ప్రత్యేకంగా మొబైల్ లైబ్రరీకి ఇన్‌ఛార్జిగా ఒక కానిస్టేబుల్‌ను నియమించామని తెలిపారు. స్టడీ మెటీరియల్‌కు సంబంధించి ఆయనను 9966141347 నంబర్‌కు ఫోన్‌లో సంప్రదిస్తే ఏర్పాటు చేస్తానన్నారు. మండల వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో ఫ్రెండ్లీ పోలీస్ విధానంపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తానన్నారు. గ్రామాల్లో గ్రామ దేవతలు పండగల సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలకు విధిగా పోలీసులు అనుమతి ఉండాలన్నారు. కార్యక్రమంలో గునుపూడి సర్పంచ్ సూర్యనారాయణ, పి.జగ్గంపేట గ్రామ కమిటీ అధ్యక్షుడు అడిగర్ల భాస్కరరావు పాల్గొన్నారు.



నిరుద్యోగులకు పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్ అందిస్తున్న ఎస్‌ఐ తారకేశ్వరరావు

భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి

అనకాపల్లి: స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు కోరారు. ఆదివారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో భగత్‌సింగ్ 118 జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ 23 సంవత్సరాల వయస్సులో దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు భగత్‌సింగ్ అని కొనియాడారు. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా విప్లవ ఉద్యమం నడిపిన ధైర్యశాలి, సమసమాజ స్థాపన నా లక్ష్యం అని ప్రకటించిన మేధావి ఆయనకే దక్కిందన్నారు. నేటి పాలకులు అమలు చేస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అల్యూమినియం వర్కర్స్ యూనియన్ కార్యదర్శి బుద్ధ భద్రారావు, సభ్యులు కొండూరు వీరాచారి, కె.శ్రీను, గిరి, శ్యామ్, విత్తనాల పోతురాజు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన రాజాన దొరబాబు

పూర్వ విద్యార్థుల సందడి

అనకాపల్లి టౌన్: ఏరా.. ఎలా ఉన్నావు? ఏమి చేస్తున్నావు.. అంటూ ఆత్మీయ పలకరింపులతో పూర్వ విద్యార్థులంతా సందడి చేశారు. కొత్తూరు ఏఎంఏఎల్ కళాశాల వేదిగా ఆదివారం కలుసుకున్న వీరంతా ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఇక్కడ 1996–99 సంవత్సరంలో చదివిన డిగ్రీ బ్యాచ్ విద్యార్థుల సమావేశం ఆదివారం సందడిగా జరిగింది. 25 సంవత్సరాల తర్వాత కలుసుకుని తమకు విద్యను బోధించిన అధ్యాపకులను ఆహ్వానించి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సత్కరించుకున్నారు. ఈ సందర్భంగా పదవీ విరమణ చేసిన అధ్యాపకులు పప్పల ఆదినారాయణ, మారేశ్వరరావు, అశోక్ కుమార్, నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచి నైతిక విలువలు బోధించాలన్నారు. ప్రస్తుత సమాజంలో స్పీడ్ విద్యా విధానం పెరగడం వల్ల విద్యార్థుల్లో క్రమశిక్షణ, సమాజం పట్ల బాధ్యత, నైతిన విలువలు లోపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి విద్యార్థులకు దేశభక్తి, నైతిక విలువలు, సమాజం పట్ల బాధ్యత తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో గొంప వెంకట్, బోయిన చిన్నారావు, నరసింహమూర్తి, సింహాద్రి, గోపి, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.



అధ్యాపకులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

5న దసరా ఉత్సవ మహాసభ

కశింకోట: మండలంలోని నరసింగబిల్లిలో వచ్చే నెల 5న దసరా ఉత్సవ మహాసభను నిర్వహించాలని ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు నిర్ణయించారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ఏర్పడి వందేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రతినిధులు ఆదివారం గ్రామ పెద్దలను కలిసి ఆహ్వాన పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు రామకోటి పరమేశు, చిరంజీవి రాజు, జెర్రిపోతుల నూకినాయుడు, కోన లక్ష్మి, గేదెల శేషుబాబు, గేదెల నానాజీ, కోన రవీంద్రనాయుడు, మారిశెట్టి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కూటమి అరాచకాలకు మూల్యం తప్పదు

- మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్
- డిజిటల్ బుక్ యాప్ ఆవిష్కరణ

నర్సీపట్నం : కూటమి ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకుని పాల్పడిన అరాచకాలకు భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ధ్వజమెత్తారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం పార్లమెంట్ పరిశీలకుడు చిక్కాల రామారావుతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతూ వేధింపులకు పాల్పడుతున్నారన్నారు. టీడీపీ నాయకుల ఒత్తిడి మేరకు పోలీసులు వారిపై కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. దాడులు, అక్రమ కేసులు డిజిటల్ బుక్‌లో నమోదు చేయడం జరుగుతుందని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలో నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, ఆస్తుల ధ్వంసం చేశారని మండిపడ్డారు. పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు టీడీపీ నాయకులకు తొత్తుల్లా వ్యవహరిస్తున్నారన్నారు. రాజకీయ కక్షతో పార్టీ నాయకులు కర్రి శ్రీనివాసరావు, చిటికెల కన్నబాబు భవనాలను కూలగొట్టించారన్నారు. గబ్బాడ ఇసుక యార్డులో ఇసుకను అక్రమంగా తరలిస్తుంటే తమ పార్టీ నాయకులు అడ్డుకోవడం జరిగిందన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిని వదిలేసి తమ పార్టీ నాయకులపై రూరల్ సీఐ రేవతమ్మ, ఎస్‌ఐ రాజారావు, తహసీల్దార్ రామారావు తప్పుడు కేసులు పెట్టారన్నారు. అక్రమ కేసులకు నిరసనగా తాను, పార్టీ నాయకులం శాంతియుత ధర్నాకు పిలుపునిస్తే టౌన్ సీఐ గోవిందరావు అక్రమ కేసులు పెట్టారన్నారు. టీడీపీ నాయకుల తప్పుడు ఫిర్యాదుతో గొలుగొండ ఎస్‌ఐ చీడిగుమ్మలకు చెందిన 11 మందిపై అక్రమ కేసులు పెట్టి జైల్లో పెట్టారన్నారు. ఎప్పుడో జరిగిన విషయాన్ని తెరమీదకు తెచ్చి మాకవరపాలెం ఎస్‌ఐ దామోదర్ తమ పార్టీ వారిపై అక్రమ కేసులు పెట్టారన్నారు. అల్లంపల్లి ఈశ్వరరావుపై రౌడీషీటర్ దాడి చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారుల తీరుమార్చుకోకపోతే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. బాధిత నాయకులు, కార్యకర్తలకు అండగా నిలిచేందుకు పార్టీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక డిజిటల్ బుక్‌ను అందుబాటులోకి తెచ్చారన్నారు. ఎక్కడైనా అన్యాయం జరిగినా డిజిటల్ బుక్‌లో నమోదువుతాయన్నారు. బాధితులకు అన్ని రకాలుగా పార్టీ అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రుత్తల యర్రాపాత్రుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, టౌన్ పార్టీ అధ్యక్షుడు ఏకాశివ, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ రుత్తల సర్వం, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు ఫాణిశాంతరావు, నాగేశ్వరరావు, రమణ, పార్టీ నాయకులు రుత్తల సత్యనారాయణ, సుర్ల సత్యనారాయణ, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు లోచల సుజాత, మాకిరెడ్డి బుల్లిదొర, వికాస్ సతీష్, నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



డిజిటల్ బుక్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్, పరిశీలకులు చిక్కాల రామారావు



చోడవరంలో డిజిటల్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న అమర్‌నాథ్

ప్రజా సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం విఫలం

- మాజీ మంత్రి అమర్‌నాథ్

చోడవరం : ప్రజాసమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, చోడవరం నియోజకవర్గం సమన్వయకర్త గుడివాడ అమర్‌నాథ్ ధ్వజమెత్తారు. చోడవరం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు తాను ఎప్పుడూ అండగా ఉంటానన్నారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వం ఆదుకోకపోవడంతో చెరకు రైతులు, కార్మికులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. బీఎన్‌రోడ్డు విస్తరణ పనులు చేపట్టకపోవడంతో రోడ్డు అధ్వానంగా మారిందని, విజయరామరాజుపేట వద్ద తాచేరునదిపై కొట్టుకు పోయిన కాజ్‌వేను వెంటనే నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో కార్యకర్తలందరికీ పూర్తిగా అందుబాటులో ఉంటానని, ఎటువంటి సమస్యలు వచ్చినా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావు, జెడ్పీటీసీలు మారిశెట్టి విజయశ్రీకాంత్, దొండ రాంబాబు,ఎంపీపీలు గాడి కాసు, పైల రాజు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్, మండల అధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, పార్టీ నాయకులు పల్లా నర్సింగరావు, దేవరపల్లి సత్య, శరగడం సిమ్మినాయుడు, దొడ్డి వెంకట్రావు, పల్లా ధనాజీ, ఓరుగంటినెహ్రూ, బొడ్డేడ సూర్యనారాయణ, దొండా నారాయణమూర్తి, ముక్కా మహాలక్ష్మినాయుడు, కంచిపాటి జగ్గారావు పాల్గొన్నారు.

మార్మోగిన భవానీ భక్తుల శరణుఘోష



ప్రత్యేక అలంకరణలో కె.జె.పురం మోదమాంబ అమ్మవారు



వంటర్లపాలెంలో మహాచండి దేవిగా దుర్గాదేవి అలంకరణ



దుర్గా పోలిపల్లమ్మను దర్శించుకున్న మాజీ ఎంపీపీ రామధర్మజ



వెంకన్నపాలెంలో కనకదుర్గమ్మవారి ఆలయంలో మహాచండీదేవి అలంకరణలో దుర్గమ్మ

చోడవరం : వెంకన్నపాలెం గ్రామంలో దుర్గమ్మ శరణుగోషతో అంతా మారుమోగింది. ఇక్కడి కొండపై వేంచేసియున్న కనకదుర్గమ్మ అమ్మవారికి బోనాలు, ఘటాలలో భక్తులు మొక్కులు చెల్లించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహాచండీదేవి అలంకరణలో దుర్గమ్మ భక్తులకు దర్శనమించ్చారు. పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించి అమ్మవారిని అంతా స్మరించారు. సుమారు 300మంది భవానీలు, భక్తులు కలిసి బోనాలు, ఘటాలు ధరించి మేళతాళాలు, డప్పులతో మెయిన్‌రోడ్డు పై ఏర్పాటుచేసిన దుర్గమ్మ మండపం నుంచి భారీ ఊరేగింపు నిర్వహించారు. పుర వీధుల మీదుగా దుర్గమ్మ కొండపైకి భక్తులంతా కాలినడకన వెళ్లి మొక్కులు చెల్లించారు. పెద్దసంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. చోడవరం పాత బస్టాండ్ దగ్గర వేంచేసియున్న శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని మహాచండీ అలంకరణలో దర్శనమిచ్చారు.

మాడుగుల : శరన్న నవరాత్రి ఉత్సవాలులో బాగంగా దేవీతల్లి మహా చండీ అవతారంలో ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. సాయంకాలం ఆర్కెస్ట్రా కార్యక్రమం నిర్వహించారు. మాడుగులలో వెలసిన దుర్గా పోలిపల్లెమ్మ అమ్మవారిని ఆదివారం మహాచండి అవతారంలో అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గొలుగొండ: ఏఎల్‌పురం గ్రామంలో ఉన్న కనకదుర్గ ఆలయంలో నవరాత్రుల సందర్భంగా ఆదివారం కుంకుమ అర్చన నిర్వహించారు. ఆదివారం చండీ అవతారం కావడంతో వేద పండితులు 108 మంది ఆడపడుచులతో సహస్ర కుంకుమార్చనలు జరిపారు.

మాడుగుల రూరల్: మండలంలోని మోదమాంబ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కె.జె.పురం, ఎం.కోడూరు, సాగరం, ఘాట్‌రోడ్డు జంక్షన్ కాటా వద్ద గల అమ్మవార్లకు భవానీ భక్తులు పూజలు నిర్వహించారు. శరనవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా ఆలంకరించారు.

మాడుగుల రూరల్: శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా వంటర్లపాలెం కనకదుర్గమ్మ ఆలయంలో గల అమ్మవారిని ఆదివారం మహా చండి దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద అన్నసమారాధన జరిపారు. కేజె.పురం జంక్షన్‌లోని కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అష్టలక్ష్మీ కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన జరిపారు.



కేజేపురం కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కుంకుమ పూజలు



ఏఎల్‌పురం కనకదుర్గ ఆలయంలో కుంకుమ పూజలు

వెంకన్న ఆలయ నిర్మాణానికి విరాళాలు

మునగపాక: కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులు మునగపాకలో చురుగ్గా సాగుతున్నాయి. పలువురు భక్తులు తమవంతు సాయం అందజేస్తూ ఆలయ అభివృద్ధిలో భాగస్వాములవుతున్నారు. ఆదివారం మునగపాకకు చెందిన శరగడం రాము, సునీత దంపతులు రూ.70 వేలు విరాళంగా అందజేశారు. నాగులాపల్లికి చెందిన పెంటకోట వేంకట రత్నంనాయుడు, భారతి దంపతులు రూ.50,116, మునగపాకకు చెందిన బొడ్డేడ మోహనరావు, జ్యోతి దంపతులు రూ.5,116 విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ బద్దెం సూర్యనారాయణ, దాడి మునిలి నాయుడు, సూరిశెట్టి రాము, కాండ్రేగుల జగ్గారావు, మొల్లేటి సత్యనారాయణ, పెంటకోట సత్యనారాయణ(నానబ్బాయి), ఎంఎం నాయుడు, పెంటకోట ఉమేష్, బొడ్డేడ రామునాయుడు, వెలగా శ్రీనివాసరావు, పెంటకోట ఆదివిష్ణు తదితరులు పాల్గొన్నారు.



రూ.70 వేల విరాళం అందజేస్తున్న రాము

సేవగరిడీ దాసులకు సత్కారం

మునగపాక: మండలంలోని నాగులాపల్లిలో సేవగరిడీ దాసులకు ఘన సత్కారం నిర్వహించారు. గ్రామంలోని పాలమరశెట్టి సేవగరిడీ తోడపెద్దు అచ్చుపోతలో భాగంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన 32 సేవ గరిడీల దాసులను ఆదివారం స్థానికులు ఘనంగా సత్కరించారు. తోడపెద్దును పాలమరశెట్టి సూర్యనారాయణ దంపతులు కొనుగోలు చేసి కమిటీకి అప్పగించారు. మూల దాసుడు పాలమరశెట్టి సంతోష్, స్థానికులు మళ్ల ఉమామహేశ్వరరావు, పాలమరశెట్టి నూకాలయ్య, నాగప్పారావు, జగన్‌హరి, మళ్ల అప్పలనాయుడు, మళ్ల కాలేశ్వరరావు తదితరులు సత్కార కార్యక్రమంలో పాల్గొన్నారు.